క్లుప్తంగా

కృష్ణాష్టమి వేడుకలు



అల్ఫోర్స్‌లో రాధాకృష్ణుల వేషధారణ

భైంసాటౌన్: పట్టణంలోని పాఠశాలల్లో సోమవారం ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాధాకృష్ణుల వేషధారణలో ఆకట్టుకున్నారు. భైంసా అల్ఫోర్స్ పాఠశాలలో నిర్వహించిన వేడుకలకు చైర్మన్ నరేందర్‌రెడ్డి హాజ రయ్యారు. పండుగ విశిష్టతను వివరించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూమిపూజ

మామడ: మండలంలోని పొన్కల్ గ్రామంలో శబరిమాత ఆశ్రమ నిర్మాణానికి సోమవారం బాలదాస్ మహారాజ్ భూమిపూజ చేశారు. అనంతరం ఈ ఆశ్రమ నిర్మాణానికి ప్లాట్‌ను విరాళంగా అందించిన బి.నారాయణ–ముత్తవ్వ దంపతులను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూమేశ్వర్, అడెల్లు తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు అందజేత



పట్టాలు అందిస్తున్న ఆర్డీవో రత్నకల్యాణి

కడెం: మండలంలోని పెద్దూర్‌తండాకు చెందిన పలువురికి సోమవారం జిల్లా కేంద్రంలో ఆర్డీవో రత్నకల్యాణి జీవో నం.58 కింద ఇంటి స్థలాలకు సంబంధించిన పట్టాలు అందజేశారు. అర్హులైన కడెం–పెద్దూర్ గ్రామస్తులు పట్టాలు పొందేందుకు తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని తహసీల్దార్ ఎం.రాజేశ్వరి సూచించారు.

బ్యాగులు పంపిణీ



విద్యార్థులకు బ్యాగులు అందిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ వరుణ్‌రెడ్డి పాఠశాలల విద్యార్థులకు 200 బ్యాగులు పంపిణీ చేశారు. గ్రామ విద్య ప్రాజెక్టులో భాగంగా గ్రామీణ సపోర్ట్ ఫౌండేషన్ చైర్మన్ కదారి నరేశ్ సమకూర్చిన బ్యాగులను కలెక్టర్ అందించారు. కార్యక్రమంలో కుంటాల మండల పెంచికల్‌పాడ్ పాఠశాల ఉపాధ్యాయుడు దిగంబర్, చంద్రకాంత్, కిష్టయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దళిత సంఘాల ఆందోళన

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంజులాపూర్‌లో ఓ ప్రైవేట్ పాఠశాల ఎదుట రహదారిపై దళిత సంఘాల నాయకులు సోమవారం ఆందోళన చేపట్టారు. మూడు రోజుల కిందట పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థి రెండో అంతస్తు నుంచి దూకి తీవ్రంగా గాయపడ్డారు. పాఠశాల యాజమాన్యం ఒత్తిడితోనే భవనంపై నుంచి దూకాడని.. వెంటనే యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందులో నాయకులు ముడుసు సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

భైంసా: ముధోల్ మండలం మచ్కల్ గ్రామానికి చెందిన గంగుల్‌వార్ పద్మకు రూ.90 వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. సోమవారం ముధోల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజాప్రతినిధులు పద్మకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి అధ్యక్షుడు రాంరెడ్డి, ఎంపీటీసీ ఆత్మ స్వరూప్, సర్పంచ్ అశ్విని, మైసాజీ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కేర్బ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

నిర్మల్‌చైన్‌గేట్: మామడ మండలం కిషన్‌రావుపేటకు చెందిన రమణారెడ్డి, రాథోడ్ గణేశ్, లక్ష్మణచాంద మండలం మునిపెల్లికి చెందిన చింతకింది శేఖర్‌రెడ్డి, రాచాపూర్‌కు చెందిన ఊపిరి పోశెట్టి సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు వారికి తన క్యాంపు కార్యాలయంలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారి వెంట పలువురు ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని రాంగనగర్ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మెన్షన్ మెడికల్ క్యాంప్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి గంగాదాస్, సిబ్బంది పనేందర్ పాల్గొన్నారు.

సన్మానం

భైంసా: బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమితులైన బోస్లే బాజీరావును సన్మానించారు. సోమవారం భైంసాలో కుభీర్ మండలం సాంవ్లీ గ్రామానికి చెందిన చక్రదర్‌పటేల్, హరిరామ్ తదితరులు సన్మానించారు.

సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయం

- ప్రారంభమైన పోషణ మాసోత్సవం
- నెల పాటు అవగాహన సదస్సులు



లక్ష్మణచాంద మండలం బోరిగాంలో పోషకాహారం ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ టీచర్

లక్ష్మణచాంద: ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రభుత్వాలు పలు కార్యక్రమాలను ప్రవేశపెడుతున్నాయి. చిన్నారులతోపాటు గర్భిణులు, బాలింతలు పోషకాహార లోపం బారిన పడకుండా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాలతో కూడిన ఆహారం అందిస్తున్నాయి. చిన్నారుల్లో ఎత్తుకు తగ్గ బరువు లేకపోవడం, గర్భిణులు, బాలింతలు రక్తహీనత బారిన పడటం వంటి సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వం సెప్టెంబర్‌ను పోషణమాసంగా నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా నెలరోజుల పాటు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

జిల్లా వివరాలివీ..

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు 926 ఇందులో ప్రధాన కేంద్రాలు 816, మినీ కేంద్రాలు 110. ఈ కేంద్రాలకు వెళ్లే చిన్నారుల సంఖ్య 61,061, గర్భిణులు 5,096, బాలింతలు 6,012 మంది ఉన్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది పోషకాహార లోపంతో బాధపడే వారి సంఖ్య తగ్గించడమే లక్ష్యంగా ముందుకు సాగనున్నట్లు ఐసీడీఎస్ అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు అంగన్‌వాడీ కేంద్రంలో పలు అంశాలపై అవగాహన కల్పిస్తారు.

ఈనెల మొదటి వారంలో..

- ప్రధానంగా తల్లిపాల ప్రాముఖ్యత వివరించడం. శిశువులకు ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇచ్చేలా బాలింతలకు అవగాహన కల్పించడం.
- పౌష్టికాహారం ఆవశ్యకత తెలిసేలా అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల చేత స్కిట్‌లు చేయించడం.
- పోషకాల వంటకాల తయారీ, ప్రదర్శన.
- చిన్నారుల శారీరక, మానసిక ప్రగతిపై సమగ్రమైన కార్యాచరణ ఏర్పాటు చేయడం.

రెండో వారం..

- కమ్యూనిటీ నీటి వనరుల వద్ద పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించడం. ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామాల్లో ర్యాలీలు చేపట్టడం.. అపరిశుభ్రతతో కలిగే నష్టాలను వివరించడం.
- చిరుధాన్యాల ప్రయోజనాలను వివరిస్తూ ర్యాలీలు, సదుస్సులు నిర్వహించడం.
- పండుగలకు చేసే వంటకాలను చిరుధాన్యాలతో చేయించడం.
- ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఔషధ మొక్కల ప్రాధాన్యత వివరించి ఇంటి ఆవరణలో నాటేలా అవగాహన కల్పించడం.. కిచెన్ గార్డెన్‌ల ఏర్పాటు చేయడం.
- సాధారణ ప్రసవం జరిగేలా గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో యోగా చేయించడం,

మూడో వారం..

- గ్రామాల్లో స్వాతంత్ర్య సమరయోధులతోపాటు వారి కుటుంబాలను గౌరవించడం.
- జాతీయ జెండా ఆవిష్కరణ, జాతీయ గీతాలాపన చేయడం.
- కిశోర బాలికలు రక్తహీనత బారిన పడకుండా పోషకాహారం తీసుకునేలాగా ప్రజలకు అవగాహన కల్పించడం.
- రక్తహీనత పరీక్షలు చేయించి అవసరమైన వారు మందులు వినియోగించేలా చూడటం.

నాలుగోవారం.

- డయేరియాపై అవగాహన కల్పించడం
- అన్నప్రాసన, పోషణ దినోత్సవం నిర్వహణ, గ్రామాల్లో సమావేశాలు నిర్వహించడం.
- ఇమ్యూనైజేషన్ క్యాంపు ఏర్పాటు చేసి.. శిశువులకు నెలల టీకాలు వేయించడం
- యువజన సంఘాల నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేసి అంగన్‌వాడీ కార్యక్రమాల్లో పాల్గొనేలా చేయడం.

గతేడాది కార్యక్రమంతో సత్ఫలితాలు..

- గతేడాది పోషణ మాసోత్సవంలో భాగంగా నిర్మల్ నియోజకవర్గంలో పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్‌గార్డెన్లు ఏర్పాటు చేశారు.
- కిచెన్‌గార్డెన్‌లో పండిన కూరగాయలను అంగన్‌వాడీ కేంద్రంలో వండిపెడుతున్నారు. ఆ
- రక్తహీనతతో బాధపడుతున్న బాలికలను గుర్తించి పోషకాహారం అందించారు.

సూచనలు పాటించా



గతేడాది మా గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో సాధారణ ప్రసవాలు, తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించారు. వారి సూచనలు పాటించడంతోనే సాధారణ ప్రసవం ద్వారా పండంటి బిడ్డకు జన్మనిచ్చా.

– మనస్విని, బోరిగాం, మం.లక్ష్మణచాంద

పకడ్బందీగా నిర్వహిస్తాం



గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవం పకడ్బందీగా నిర్వహిస్తాం. లబ్ధిదారులు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని అక్కడ అందించే పోషకాహారం తీసుకోవాలి. గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా అధికారుల సూచనలు పాటించాలి.

– నాగమణి, సీడీపీవో, నిర్మల్

ఆలయాల్లో భక్తుల పూజలు



లోకేశ్వరం: బాగాపూర్ ఆలయంలో పూజలు



సర్సాపూర్: దాతలను సన్మానిస్తున్న నాయకులు



కాల్వ నరసింహస్వామి ఆలయంలో భక్తులు

కుంటాల: మండలంలోని సూర్యాపూర్ శ్రీ రాజరాజేశ్వరాలయం, ఓలా శివాలయం, కుంటాలలోని ఉమామహేశ్వర, మహాదేవుడి ఆలయాల్లో సోమవారం భక్తుల సందడి నెలకొంది. సూర్యాపూర్‌లో మాజీ ఎంపీపీ అ రుణ–రమణారావు దంపతులు పూజలు చేశారు. కుభీర్ రాజన్న కోడె మొక్కు చెల్లించుకున్నారు. కుంటాల ఉమామహేశ్వర ఆలయంలో సువర్ణ, జ్యోతి–శ్రీనివాస్, శైలజ–వంశీ, సూర్యాపూర్ శ్రీ రా జరాజేశ్వరాలయంలో శీల సరస్వతి–పోతన్న దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

భైంసా: ముధోల్‌లోని శ్రీ జటశంకర్ ఆలయంలో సోమవారం భక్తులు శ్రావణమాస పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే దర్శనానికి బారులు తీరి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

లోకేశ్వరం: మండలంలోని బాగాపూర్ శివారులోని రాజ్యలక్ష్మి సహిత లక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అష్టోత్తరపూజ, సహస్ర, తులసి దళార్చన, ఉత్సవ మూర్తులకు అభిషేక పూజ, సత్యనారాయణ వ్రతం పూలహారతి జరిపించారు. అర్చకులు నరసింహ స్వామి, వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

తానూరు: మండలంలోని బోరిగాం గుట్ట ప్రాంతంలోని మహాదేవుడి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. మండలంతోపాటు మహారాష్ట్రలోని పలు గ్రామాల భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ సాగరబాయి ముడుపులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, చంద్రకాంత్ యాదవ్, సర్పంచ్‌లు తదితరులు ఉన్నారు.

సర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి పంచాయతీ పరిధిలోని డొంగుర్గాం సిద్దేశ్వరాలయంలో భక్తులు శివలింగానికి పూజలు చేశారు. కల్లూర్‌కు చెందిన గుద్దేటి లక్ష్మీనారాయణ దంపతులు భక్తులకు అన్నదానం చేశారు.

దిలావర్‌పూర్: మండలంలోని కదిలి శ్రీమాతన్నపూర్ణ పాపహరేశ్వరాలయంతోపాటు కాల్వ అటవీ ప్రాంతంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయాల్లో శ్రావణమాస పూజలు కొనసాగుతున్నాయి. సోమవారం పాపహరేశ్వరాలయంలో అభిషేకం, మహిళలు కుంకుమార్చన నిర్వహించారు. నిర్మల్‌కు చెందిన సంతోష్ కలర్ ల్యాబ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కాల్వ అటవీ ప్రాంతంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో దిలావర్‌పూర్‌లోని ఏకనాథుని ఆలయం, రాజరాజేశ్వరాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కదిలి ఆలయ కమిటీ చైర్మన్ నార్వాడి వెంకట్రావు పాటిల్, మాజీ చైర్మన్లు భుజంగ్‌రావుపాటిల్, సంభాజీరావు పాటిల్, కాల్వ శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ మహేశ్, చిన్నయ్య పాల్గొన్నారు.

వాతావరణ మార్పులతోనే తెగులు



పంటను పరిశీలిస్తున్న ఏవో ప్రవీణ్‌కుమార్

లక్ష్మణచాంద: వాతావరణంలో వచ్చే మార్పులతోనే సోయా పంటలకు కాండపు ఈగ తెగులు సోకుతుందని మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని చామన్‌పెల్లిలో రైతులు సాగు చేస్తున్న సోయా పంటలను ఆయన పరిశీలించి మాట్లాడారు. పంట ఎండిపోవడం ద్వారా పూత, కాత నిల్వదన్నారు. తెగులు ఉధృతి వేగంగా విస్తరిస్తుందని.. బియ్యపు గింజ వంటి తెల్ల పురుగులు(లార్వాలు) కాండంలోని వెళ్లి గుజ్జును తినేస్తుందన్నారు. దీని నివారణకు క్లోరాంట్రినిప్రోల్ 60 ఎంఎల్ ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. క్లోరోఫైరిపాస్ 3.5 ఎంఎల్, లేదా లామ్డాసైహాలోత్రిన్ 2 ఎంఎల్, డైమిథాయెట్ మూడు ఎంఎల్ ఎకరాకు పిచికారీ చేసుకోవాలని సూచించారు.

తహసీల్దార్‌కు మత్స్యకారుల వినతి

దిలావర్‌పూర్: మండలంలోని కాల్వ గ్రామంలో చెరువు, కొత్తకుంట, దేవునికుంట, నర్సన్నకుంట అక్కమ్మ కుంటల తూములు సరిగా లేకపోవడంతో గతేడాది చేపపిల్లల పెంపకం చేపట్టలేదని.. తమకు డ్రైడ్ ఆఫ్ (చెరువు ఎండిపోయినట్లు) సర్టిఫికెట్ ఇవ్వాలని మత్స్యకారులు కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలో తహసీల్దార్ డి.సరితకు మత్స్యకారులు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చెరువులు, కుంటల తూములు సరిగా లేక నీరు నిల్వక వృథాగా బయటకు పోయిందన్నారు. దీనికి తోడు మత్స్యకార సహకార సంఘం నుంచి రుసుం చెల్లించాలని తమకు నోటీసులు అందజేశారని పేర్కొన్నారు. డ్రైడ్ అప్ సెర్టిఫికెట్ ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాల్వ గ్రామ మత్స్యకారులు పాల్గొన్నారు.

పద్మశాలీలు ఐక్యతతో సాగాలి



మాట్లాడుతున్న న్యాయవాది కేశవదాస్

లోకేశ్వరం: పద్మశాలీలు ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకునేందుకు ముందుకు సాగాలని పద్మశాలి సంఘం రాష్ట్ర సభ్యుడు, హైదరాబాద్ న్యాయవాది రావుల కేశవదాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పద్మశాలి సంఘ భవనంలో ఏర్పాటు చేసిన మండల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. చట్టసభల్లో పద్మశాలీలు ఉంటేనే అభివృద్ధి సాధ్యమన్నారు. సంఘంలో సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు సాయన్న, కుంటాల అధ్యక్షుడు గంగాధర్, సాయిరాం, శ్రీనివాస్, నాయకులు నవీన్, చిన్నయ్య , పండరి, భైంసా సాయన్న, నగేశ్, మిషిన్ నారాయణ, గడ్డం సంజీవ్ ఉన్నారు.

తాగి నడిపిన వారికి జరిమానా

నిర్మల్‌టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపిన ఎనిమిది మందికి జరిమానా, ముగ్గురికి ఐదు రోజుల సాధారణ జైలుశిక్ష విధిస్తూ నిర్మల్ న్యాయస్థానం తీర్పునిచ్చినట్లు పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం మత్తులో వాహనం నడుపుతూ పట్టుబడిన పలువురిని నిర్మల్ కోర్టులో హాజరు పరిచారు. ఈ సందర్భంగా ఎనిమిది మందికి రూ.6,600 జరిమానా విధిస్తూ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి తీర్పునిచ్చారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెంబికి బస్సు నిలిపివేతపై ఆందోళన



కంట్రోలర్‌ను నిలదీస్తున్న పెంబివాసులు

ఖానాపూర్: పెంబి మండల కేంద్రానికి ఖానాపూర్ నుంచి రోజు వెళ్లే బస్సు సర్వీసును నిలిపివేయడంపై పెంబి మండలవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఈ విషయమై ఖానాపూర్‌లోని ఆర్టీసీ బస్టాండ్ వద్దకు వెళ్లి కంట్రోలర్‌ను నిలదీశారు. మూడు రోజులుగా బస్సు రాకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. స్పందించిన కంట్రోలర్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బస్సును పునరుద్ధరిస్తామనడంతో వారు శాంతించారు.

ముగ్గురు ఉపాధ్యాయులకు అవార్డులు

- నల్గొండలో పుడమి సాహితి వేదిక ఆధ్వర్యంలో ప్రదానం



అవార్డు స్వీకరిస్తున్న పీడీ హంసలత

లక్ష్మణచాంద: పుడమి సాహితి వేదిక ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా కేంద్రంలో అందించిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు జిల్లా నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. లక్ష్మణచాంద మండలం పీచర ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు కె.హంసలత, సారంగపూర్ మండలం చించోలి(బి) జెడ్పీ ఉన్నత పాఠశాల పీడీ అన్నపూర్ణ, ఖానాపూర్ మండలం పాతఎల్లాపూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కిషన్‌కు అవార్డులు ప్రదానం చేశారు. శ్రీనాథ మహాకవి, శ్రీ భక్త రామదాసు, విగుడు వెంకట రామమూర్తి, కవయిత్రి మొల్ల వారసులు ఈ వేడుకలో పాల్గొన్నట్లు అవార్డులు పొందిన ఉపాధ్యాయులు తెలిపారు.

తహసీల్దార్‌కు సమ్మె నోటీసు అందజేత



నోటీసు అందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

లక్ష్మణచాంద: తమ సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 11 నుంచి నిరవధిక సమ్మెలో పాల్గొంటామని సోమవారం మండల కేంద్రంలో తహసీల్దార్ శ్రీలతకు సమ్మె నోటీసు అందజేశారు. అంగన్‌వాడీ టీచర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లలిత మాట్లాడుతూ తమకు నెలకు రూ.26వేలు, పెన్షన్, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్ టీచర్లకు రూ.10లక్షలు, సహాయకులకు రూ.5 లక్షలు.. ఉద్యోగ విరమణ వయసు 60 ఏళ్లకు పెంచాలని కోరారు. ఆ సంఘం మండల అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, భాగ్యలక్ష్మి, ఉమ, గంగామణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): తాము ఈనెల 11 నుంచి సమ్మెలోకి వెళ్తునట్లు మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ గజానన్‌తోపాటు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై రవీందర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఆ సంఘం మండల అధ్యక్షురాలు గంగామణి, గంగవ్వ, అరుణ, ప్రేమల, లక్ష్మి, సరోజ, తిరుమల, సునీత, హైమావతి, ప్రమీల, కవిత, కరుణ పాల్గొన్నారు.

త్యాగాలకు గుర్తుగా అమృతవాటిక నిర్మాణం



మట్టి సేకరిస్తున్న బీజేపీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగం చేసిన వారిని స్మరించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో అమృతవాటిక నిర్మాణం చేపట్టినట్లు 'మేరీ మిట్టి.. మేరా దేశ్'కార్యక్రమ జిల్లా కన్వీనర్ మెడిసెమ్మె రాజు అన్నారు. సోమవారం పట్టణంలోని గాంధీచౌక్‌లో పార్టీ పట్టణ అధ్యక్షుడు బచ్చురాం ఆధ్వర్యంలో మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అమత కలశ యాత్ర పేరిట 7,500 కలశాలలో మట్టిని సేకరించి అమృత వాటిక స్థూపం నిర్మించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వడ్లకొండ అలివేలు, పోలిశెట్టి కిషన్, అశోక్, గంప శ్రీనివాస్, గణేశ్, ఒడిశెల శ్రీనివాస్, మంగమ్మ, శ్రీలత, కాలనీవాసులు పాల్గొన్నారు.

భైంసారూరల్: మండలంలోని సుంక్లి గ్రామ నాగదేవత ఆలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పవార్ రామారావుపటేల్ పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం గ్రామంలో నా మట్టి నా దేశం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంగల్‌రావు, బాలాజీపటేల్, సాయినాథ్‌పటేల్, శంకర్, దిగంబర్‌పటేల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుతో లాభాలు



డ్రాగన్‌ఫ్రూట్ తోటను పరిశీలిస్తున్న ఏవో స్రవంతి

దిలావర్‌పూర్: రైతులు ఉద్యాన పంటలు సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయాధికారిణి స్రవంతి అన్నారు. మండల కేంద్రానికి చెందిన కదం హరికృష్ణ పాటిల్ ఎకరంలో సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ తోటను సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఇప్పుడే పంట చేతికి వస్తుండడంతో నిర్మల్–భైంసా రహదారిపై ఓ విక్రయ కేంద్రం ఏర్పాటు చేశాడు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏవో, సిబ్బంది, స్థానిక రైతులు ధని రవి, సప్పల రవి తోటను పరిశీలించారు. ఈసందర్భంగా రైతు మాట్లాడుతూ సేంద్రియ విధానంలో పంట సాగు చేశానని పేర్కొన్నారు. తోటి రైతులకు కూడా అవగాహన కల్పించాలని ఏవో సూచించారు.

గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేత



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

నిర్మల్: తమ సమస్యలు పరిష్కరించాలంటూ సమగ్ర శిక్షాఅభియాన్ ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఏడోరోజుకు చేరాయి. సోమవారం గాంధీపార్క్‌లో గల గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించారు. దీక్షలకు బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు భూసారపు గంగాధర్, ఉపాధ్యక్షులు భోజన్న, నరేష్, నవత, రాధిక, ప్రధాన కార్యదర్శులు రత్నం, అలేఖ్య, రాము, కోశాధికారి గజేందర్ సింగ్, మీడియా కన్వీనర్ కప్పల సుధాకర్, ఫిరోజ్, జయశ్రీ, రాజ్యలక్ష్మి, గీతారాణి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మద్దతు..

సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపడుతున్న రిలేదీక్షలకు సోమవారం బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, సీనియర్ నేతలు అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, పట్టణ అధ్యక్షుడు అరవింద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, తదితరులు ఉన్నారు.

సీట్లు సాధించిన విద్యార్థులకు సన్మానం

లక్ష్మణచాంద: మండలంలోని పీచర గ్రామానికి చెందిన రవితేజ నీట్ ఫలితాల్లో సత్తా చాటాడు. ఆదివారం రాత్రి ప్రకటించిన సెకండ్ ఫేజ్‌లో భాగంగా పీచర సర్పంచ్ బుర్రి లత–భూమేశ్ దంపతుల రెండో కుమారుడు రవితేజ ఐదు వేల ర్యాంకు సాధించి మెడిసిన్‌లో సీటు సాధించాడు. దీంతో సోమవారం జెడ్పీటీసీ సభ్యుడు రాజేశ్వర్, తదితరులు విద్యార్థిని శాలువాతో ఘనంగా సన్మానించి పూల మొక్క అందించారు.

యోగేశ్‌కు సన్మానం..

కుభీర్: మండలంలోని పార్డి(బి) గ్రామానికి చెందిన సుస్గురు యోగేశ్‌కు అరుంధతి మెడిక్ కాలేజీ హైదరాబాద్‌లో సీటు దక్కడంతో సోమవారం ఆయనను సన్మానించారు. గతంలో ఎనిమిదో తరగతి వరకు ఎల్‌బీఎం స్కూల్‌లో చదవడంతో పాఠశాలకు పిలిచి ఘనంగా సన్మానించారు. తల్లిదండ్రులు చంద్రబాగ–పోశెట్టిని అభినందించారు. ఎల్‌బీఎం ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్, ఇతర ఉపాధ్యాయులు ఉన్నారు.

సారంగపూర్: మండలంలోని చించోలి(బి) గ్రామానికి చెందిన సాయిప్రసన్న నీట్ ఫలితాల్లో సత్తా చాటి కామారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించింది. బాశెట్టి లావణ్య–ప్రత్యాగాత్మ దంపతుల పెద్ద కూతురు సాయిప్రసన్న స్థానికంగా పాఠశాల విద్య, ఇంటర్ హైదరాబాద్‌లో పూర్తి చేసింది. సాయిప్రసన్న బీసీ విభాగంలో 568వ ర్యాంకు, జనరల్ విభాగంలో 3435వ ర్యాంకు సాధించింది. తన బాబాయి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు ప్రమోద్‌రాం సహకారంతోనే సీటు సాధించానని సాయిప్రసన్న చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.